# సమన్వయంతో పనిచేయండి

- వలంటీర్లు, కన్వీనర్‌లు బాధ్యతగా వ్యవహరించాలి
- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

**ఆదోని అర్బన్:** పట్టణ, గ్రామీణ సచివాలయం వలంటీర్లు, కన్వీనర్‌లు సమన్వయంతో మెలగాలని,అర్హులందరికీ సంక్షేమపథకాలు అందేలా బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక రెడ్డీస్ ఫంక్షన్‌హాలులో సచివాలయ కన్వీనర్‌ల ఎంపిక జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ బోయశాంత, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డా.మధుసూదన్, ఎంపీపీ దానమ్మ, ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌లు రేణుక, మంజుల తదితరుల హాజరైన కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయి మాట్లాడారు.కన్వీనర్లు , వలంటీర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మరింత చేరువ కావాలని సూచించారు.సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం ...పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం చేస్తు న్న కృషి... ప్రభుత్వ పథకాల అమలు తీరు... లబ్ధిదారుల ఎంపిక విధానం... తదితర విషయాలను ప్రజలకు విశదీకరించాలన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు చేస్తున్న మేలును ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు చేస్తున్న అసత్యారోపణలను తిప్పికొట్టేలే ప్రజలకు చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నరసింహులు,గౌస్, యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దేవా,సర్పంచ్ సందీప్‌రెడ్డి,నాయకులు గోపాల్‌రెడ్డి, శేషిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, గోవిందు, ఫయాజ్, రామక్రిష్ణ, ఎరుకల లక్ష్మి, శ్రీలక్ష్మి, జిలేకాబి, శ్రీదేవి, భాను, శ్రీనివాసరెడ్డి, సర్పంచులు,ఎంపీటీసీలు,జెడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

**వలంటీర్ల పనితీరు భేష్**

వలంటీర్ల పనితీరు భేషుగ్గా ఉందంటూ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అభినందించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి కుటుంబ సభ్యులు వలంటీర్ పనితీరు బాగుందని చెప్పడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. వలంటీర్ల వ్యవస్థ లేకపోతే తమకు ఎంతో ఇబ్బందిగా ఉండేదని, ఎమ్మెల్యే అంటేనే వలంటీర్లు, వాలంటీర్లు అంటేనే ఎమ్మెల్యే అని అర్థమని చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను కాపాడుకునేందుకు మరింతగా కలిసిమెలిసి పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయితేనే సచివాలయాల వ్యవస్థ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉంటాయని, వేరే ప్రభుత్వం వచ్చిందంటే వీటిని ఎత్తివేస్తాయనే విషయాన్ని గుర్తుంచుకుని వలంటీర్లు, కన్వీనర్‌లు రథసారథులుగా అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు.

**నేటి నుంచి పెంచిన పింఛన్ అందజేత**

పాదయాత్రలో ఇచ్చిన మాట తప్పకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు పింఛన్‌లను విడతలవారీగా పెంచుతున్నారని, ఇచ్చిన మాట మేరకు జనవరి 1వ తేదీ నుంచి పెంచిన మొత్తం రూ.2750 ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారులకు అందజేస్తారని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఇంటికీ వలంటీర్లు కన్వీనర్‌లు వెళ్లి ఇచ్చిన హామీ మేరకు సీఎం పింఛన్ పెంచిన విషయాన్ని లబ్ధిదారులకు వివరిస్తూ నగదు అందజేయాలని సూచించారు.

**మంత్రి పదవి ఆశ లేదు**

ప్రజలకు ఏమి చేస్తాం అనేది కావాలని, మంత్రి పదవికావాలని తానెప్పుడూ కోరుకోలేదని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సేవ కోసం మా కుటుంబమంతా పని చేస్తోందని, రాజకీయంలో లబ్ధి కోసం రాలేదన్నారు. నాయకులు, వలంటీర్లు, కన్వీనర్‌లు, రథసారథులు అంకితభావంతో సమన్వయంతో పనిచేస్తే పార్టీలో ప్రత్యేక గుర్తింపునిస్తామని పేర్కొన్నారు.

## 175 స్థానాలలో గెలిచేలా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

**పెద్దకడబూరు:**రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచేలా పనిచేద్దామని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామ సచివాలయాలకు నూతనంగా నియమితులైన కన్వీనర్లతోపాటు వలంటీర్లతో స్థానిక బీసీకమ్యూనిటీ హాల్‌లో శనివారం వారు సమావేశం అయ్యారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో సచివాలయానికి ముగ్గురు చొప్పున మండలంలోని 18 సచివాలయాలకు 54మంది కన్వీనర్లు నియమితులయ్యారన్నారు. కన్వీనర్లతో పాటు వలంటీర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడం, ప్రజల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా పనిచేయాలన్నా రు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వరి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కోసిగి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, వైస్ ఎంపీపీ పరమేష్, సర్పంచ్ రామాంజినేయులు, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, నాయకులు రవిచంద్రారెడ్డి, గజేంద్రరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న సీతారామిరెడ్డి, అధికారులు

## రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ

**మంత్రాలయం రూరల్:** జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకంతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వై.సీతారామిరెడ్డి అన్నారు.శనివారం మండల కేంద్రంలోని దుర్గారమణ కల్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న భూ హక్కు- భూరక్ష పత్రాల పంపిణీ కార్యక్రమానికి సీతారామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ వ్యాప్తంగా వందేళ్ల తర్వాత గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామ కంఠం స్థిరాస్తులను సర్వే చేసి ఆయా రైతులకు భూ హక్కు పత్రాలను ఇవ్వడం ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం మంత్రాలయం, కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల రెవెన్యూ అధికారులు, నాయకులతో కలిసి రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య,వ్యవసాయసలహా మండలి సభ్యులు మల్లికార్జున,కోసిగి ఎంపీపీ ఈర న్న, కన్వీనర్ బెట్టన్న గౌడ్, కౌతాళం,పెద్దకడబూరు మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆటో బోల్తా.... తొమ్మిది మందికి గాయాలు

**ఆదోని టౌన్:** మండలంలోని హాన్వాల్ గ్రామ సమీపంలో శనివారం ఆటో బోల్తా పడి తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదిలక్ష్మి, అంజలి, శిరీష, జయలక్ష్మి, లక్ష్మితో పాటు మరో నలుగురికి గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు ఇందిరానగర్ నుంచి కూలీ పనుల కోసం ఆటోలో వెళ్తున్నారని, ఎద్దులబండిని తప్పించబోయి ఆటో బోల్తా పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

**నూతన క్యాలెండర్ విడుదల**

**ఆదోని రూరల్:**యూటీఎఫ్ ఆదోని డివిజన్ ఆధ్వర్యంలో శనివారం ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ 2023 నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గాదిలింగప్ప, శ్రీనివాసులు, సునీల్‌రాజ్‌కుమార్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

### ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిన్న దృశ్యం

**కౌతాళం:** మండల పరిధిలోని రౌడూరు గ్రా మంలో శనివారం విద్యా కమిటీ చైర్మన్ వీరేష్, సర్పంచ్ సుశీలమ్మ, హెచ్‌ఎం సునీల, వైఎస్సాఆర్‌సీపీ నాయకులు పాండురంగారెడ్డి, సోమిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

### బంగారు గొలుసు, సెల్‌ఫోన్ అప్పగింత

**మంత్రాలయం రూరల్:** కొయంబత్తూరుకు చెందిన మని తన స్నేహితులు 20మందితో కలిసి శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కుర్లా ఎక్స్‌పెస్‌లో మంత్రాలయం రోడ్డు చేరుకున్నారు. మనికి సంబంధించిన చిన్నారి పాప బంగారు గొలుసు, సెల్‌ఫోన్ రైలులో మరిచిపోయారు. విషయాన్ని రైల్వే హెడ్ కానిస్టేబుల్ శివరామయ్యకు తెలియజేయగా ఆయన ఆర్పీఎఫ్ పోలీసులను సంప్రదించారు. ఈ మేరకు వారు ప్రయాణించిన బెర్త్‌లో సీటు కింద సెల్‌ఫోన్, గొలుసును గుర్తించి అప్పగించారు. కానిస్టేబుల్‌లు రాజ్‌కుమార్, లోకనాథ్, వినయ్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

### న్యూ ఇయర్ వేడుకలకు అందుబాటులో ఎమ్మెల్యే సాయి

**ఆదోని రూరల్:** 2023 నూతన సంవత్సర వేడుకలకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదోనిలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గనిర్వాహక కార్యదర్శి ఎస్.గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రతియేటా కొత్త సంవత్సరం వేడుకలకు దూరంగా ఉండే ఎమ్మెల్యే నేడు నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఖర్చుతో కూడుకున్న పూలమాలలు, శాలువాలు, బొకేలు తీసుకురాకూడదని, సాధారణంగా వచ్చి శుభాకాంక్షలు తెలపాలని సూచించారు.

### విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు చూపుతున్న విద్యార్థులు

**ఆదోని అర్బన్ :** పట్టణంలోని సెయింట్ ఆంథోనీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం కరస్పాండెంట్ ఫాదర్‌జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎల్‌కే చిన్నప్ప, ఉపాధ్యాయులు కేశవయ్య, ప్రకాశమ్మ, నరసన్న, ఈరన్న, శాంతి, భారతి పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు

**ఆదోని అర్బన్ :** శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాచోటి రామయ్య ఆధ్వర్యంలో శనివారం భగవాన్ శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ సొసైటీ కేంద్రంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. 8వ నుంచి పదో తరగతి వరకు 15 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం నేషనల్ పాఠశాల శివకీర్తన, రెండోస్థానం ఆల్ఫా పాఠశాల సుల్తానా, మూడో స్థానం ఎంజేపీ పాఠశాల మమతలు గెలుపొందారు. పోటీలకు పర్యవేక్షకులుగా కేంద్రం సొసైటీ డైరెక్టర్ ఉసేన్‌అహ్మద్, బ్యాంకు సీఈఓ గట్టు మురళీకుమార్, సభ్యులు నాగమణి, నరసయ్య, సందానకర్తలుగా ఆర్‌ఎంజీ రెడ్డి, లక్ష్మికాంత్, క్రిష్ణ, భీమిరెడ్డి, దీపికారెడ్డిలు వ్యవహరించారు.

### పాదుపు మహిళలకు కోళ్ల పంపిణీ

**కోసిగి:** స్థానిక శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం ఎంపీపీ ఈరన్న చేతుల మీదుగా పొదుపు మహిళలకు కోళ్లను పంపిణీ చేశారు. మండలంలోని పొదుపు మహిళలకు ఆర్థికంగా ఎదుగుదల కోసం సబ్సిడీపై 100 యూనిట్ల కోళ్లు మంజూరైనట్లు ఏపీఎం సత్యమ్మ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాణిక్యరాజు, మహంతేష్ స్వామి, మల్లయ్య, మంగమ్మ, పొదుపు మహిళలు పాల్గొన్నారు.